# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 18 ఏప్రిల్ 2025


## పౌష్టికాహారం తీసుకోవాలి



దువ్వూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: గర్భవతులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సుకన్యలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతకుంట అరుంధతి వాడ, బుక్కాయిపల్లె గ్రామాలలో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రసవించిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, తల్లిపాలు ఇస్తే మంచి శ్రేష్టం అన్నారు. 6మాసాల వరకు క్రమం తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మి నరసమ్మ, లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి..

### ఆత్మహత్య.. కడుపు నొప్పా?



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త: కడప రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కడప నకాష్ వీధికి చెందిన సోను(23) జులాయి గా తిరిగేవాడు. ఇతనిపై గతంలో రెండు గంజాయి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిన్న పోలీసులు గంజాయి కేసులో సోను అదుపులోకి తీసుకొని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఉంచారు. రాత్రి ఉన్నఫలంగా సోనుకు కడుపు నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడికి రాగానే మృతి చెందాడు. కానీ సోను పోలీస్ స్టేషన్ లోని బాత్రూంలో తన చొక్కాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కానీ పోలీసులు ఆ విషయాన్ని ధ్రువీకరించలేదు. మృతుడి తల్లి మాత్రం తన కుమారుడు కడుపు నొప్పితోనే చనిపోయాడని మీడియాకు వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేదా కడుపునొప్పితో మృతి చెందాడు అనేది తెలియ రావడం లేదు. పోలీసులు మాత్రం ఏ విషయాన్ని స్పష్టం చేయడం లేదు.

### బద్వేలు మున్సిపల్ చైర్మన్

# పీఠం కదిలేనా...?

**అవిశ్వాసం వైపు టీడీపీ మొగ్గుచూపేనా**

**చైర్మన్ పీఠం కోసం క్యూ కడుతున్న టీడీపీ నాయకులు**

**బలం తక్కువైనా చైర్మన్ పీఠం పై కన్నేస్తారా.**

**వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపునకు వచ్చే ప్రయత్నం చేస్తారా**

**కూటమి ప్రభుత్వంలో అయినా చైర్మన్ పదవి దక్కేనా...**

బద్వేలు, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీ, కార్పోరేషన్‌లలో అవిశ్వాసానికి మొగ్గుచూపుతుంటే బద్వేలులో మాత్రంమున్సిపల్ చైర్మన్ పీఠంపై టీడీపీ నాయకులు స్థబ్దతగా ఉన్నారు. సంఖ్యాబలం తక్కువైనప్పటికీ వైసీపీ చైర్మన్‌ను దించి కూటమి నాయకుడిని గద్దెనెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు మచ్చుకుకూడా కనిపించడం లేదు. సంవత్సర కాలం ఎన్నికలకు గడువు ఉన్నా ఈ కొద్దిరోజులు అయినా చైర్మన్ పీఠం ఎక్కాలనే తపనతో అనేకమంది టీడీపీ ఆశావాహులు ఎదురుచూస్తున్నప్పటికీ కూటమి నాయకులు మాత్రం మౌనంగా ఉన్నారు. ప్రధానంగా వైసీపీ కౌన్సిలర్లను టీడీపీవైపుకు మళ్లించే ప్రయత్నాలు అన్ని ప్రాంతాలలో ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో బద్వేలులో మాత్రం ఎందుకు అలాంటి ప్రయత్నం జరగలేదని కూటమి ప్రభుత్వంలో చర్చ సాగుతోంది. లోపాయి కారి ఒప్పందాలు ఏమైనా జరిగాయా, లేక చైర్మన్ పీఠం కదిలించే ప్రయత్నం చేస్తారా, విజయమ్మ, రితేష్‌రెడ్డిల మనసులో ఏముంది. వీటిపై ఎలాంటి నిర్ణయాలు చర్చగాని సాగడం లేదని, అటు టీడీపీలోను, కూటమిలోను గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అవిస్వాసానికి మొగ్గ చూపితే మాత్రం వైసీపీ కౌన్సిలర్ల టీడీపీలోకి వస్తారనే ఊహాగానాలు కూటమిలో చర్చించుకుంటున్నా నాయకులు మాత్రం ముందడుగు వేయం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బద్వేలు మున్సిపాలిటీలో 35 వార్డులకు గాను 4 వార్డు లు మాత్రమే టీడీపీ వైపు ప్రస్తుతం ఉన్నా 31 వార్డులు మాత్రం వైసీపీకి బలం ఉన్నప్పటికీ టీడీపీ నాయకులు చర్చలు జరిపితే సంఖ్య మారే అవకాశం లేకపోలేదని కొంతమంది కౌన్సిలర్లు వచ్చే అవకాశం ఉందని గట్టి ప్రయత్నాలు చేస్తే చైర్మన్ పీఠం కూటమికి దక్కే అవకాశం లేకపోలేదని చర్చ సాగుతోంది. ఇప్పటివరకు నాయకులు మాత్రం వీటిపై ఎలాంటి చర్చ పెట్టకపోవడం వెనుక ఆంతర్యమేమిటని మరోపక్క మాత్రం డబ్బు ఎంతైనా పెట్టి చైర్మన్ అనిపించుకోవాలనే తపనతో అనేకమంది సిద్దంగా ఉన్నారు. కూటమి అదికారంలోకి వచ్చాక బద్వేలు నియోజకవర్గం టీడీపీకి అడ్డాగా మారుతుందని నాయకులు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కొన్ని లోపాల వలన నాయకులు దూరమయ్యే అవకాశం ఉందని, రాబోయే ఏ ఎన్నికలు అయినా వైసీపీ సవాలుగా తీసుకునే ప్రయత్నం చేస్తారని అపుడు కూటమికి ఎదురుదెబ్బ తగులుతుందని కూటమిలో చర్చ సాగుతోంది. పట్టణంలో టీడీపీకి బలం ఎక్కువగా ఉన్నప్పటికీ ఎన్నికలు వచ్చే సమయానికి బలహీన పడుతున్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అదే విధంగా జిల్లాలోని పులివెందుల తర్వాత బద్వేలులో స్థానబలం ఎక్కువగా ఉన్న వైసీపీ ఏ ఎన్నిక జరిగినా తన బలాన్ని నిరూపించుకోవాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ప్రస్తుతం ఉన్న చైర్మన్ పీఠం కదిలితే మాత్రం కూటమి విజయం సాధించినట్లే. లేకపోతే మాత్రం బలహీనపడే అవకాశాలు లేకపోలేదని చర్చసాగుతోంది. చైర్మన్ పీఠం కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టేందుకు టీడీపీలో అనేక మంది పోటీపడుతున్నారు. వారందరికి ఇదొక మంచి అవకాశంగా భావించి విజయమ్మ, రితేష్‌తో మాట్లాడే ప్రయత్నాలు చేసేందుకు సాహసం చేయలేక వెనకడుగు వేస్తున్నారు. టీడీపీ గాని ప్రత్యేక దృష్టిపెట్టి చైర్మన్ పీఠం కదిలిస్తే మాత్రం తెలుగుదేశంకు మళ్లి పూర్వవైభవం వచ్చే అవకాశం లేకపోలేదని కూటమి ప్రభుత్వంలో చర్చసాగుతోంది.



## చిరుతను చంపిన ముగ్గురు వేటగాళ్లు అరెస్ట్

మదనపల్లి క్రైమ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త. చిరుత పులిని చంపిన ఘటనలో అటవీ శాఖ అధికారులు గురువారం సాయంత్రం ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎఫ్ఆర్ఓ జయప్రసాద్ రావు కథనం మేరకు.. మదనపల్లె మండలం, పొన్నేటిపాలెం వద్ద మంగళవారం రాత్రి వేటగాళ్లు అడవి పందులకు తీసిన ఉచ్చులో చిక్కుకొని బుధవారం నరకయాతన పడి గర్భిణీ చిరుత పులి చనిపోవడం తెలిసిందే. ఈ ఘటనలో అడవి పందులను వేటాడేందుకు ఉచ్చులు బిగించిన పొన్నేటిపాలెంకు చెందిన రెడ్డప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి, గంగాధర్ లను అరెస్టు చేశారు. మరికొందరిని కూడాఅదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## జాతీయ నాయకుల విగ్రహాల పట్ల శ్రద్ధ చూపాలి

### మున్సిపల్ కమిషనర్ కు అన్నమయ్య జిల్లా బిసి సంఘం అధ్యక్షురాలు విన్నపం



రాయచోటి ఏప్రిల్ 17 ప్రభాతవార్త. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం నందు నడిబొడ్డు మధ్యలో స్థాపించినటువంటి రోడ్డు రహదారి మధ్యలో ఉండు జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, సంఘ నాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యక్తుల విగ్రహాలను ప్రతిష్టించినారు వాటిని సిద్ధంగా ఉంచుతూ పారిశుధ్యంలో భాగంగా వాటిని కూడా నీటితో శుద్ధి చేస్తూ వాటిపై ఉన్న దుమ్ము ధూళి పట్టకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాజబాబుకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన భారతదేశం కోసం చేసిన సేవను అభివృద్ధి గుర్తించి మనం సంవత్సరమునకు ఒకసారి గుర్తు చేసుకుని వారి వేడుకలును చేసుకుంటున్నాం కానీ తర్వాత వాటి నిర్వహణ ఎవరు పట్టించుకోని కారణం చేత ఆ విగ్రహాలు వాటి పరిసరాలు మట్టి, దుమ్ము, చెత్తలతో చాలా అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. కనుక సంవత్సరమునకు ఒకసారి కాకుండా కనీసం నెలకు ఒకసారి అయినా ఆ విగ్రహాలను శుభ్రపరచాలని వారు చేసినటువంటి సేవలను విలువలను గుర్తించి మన అన్నమయ్య జిల్లాను ఆంధ్రప్రదేశ్లోనే ఆదర్శంగా తీసుకునే విధంగా చేయాలని మున్సిపల్ కమీషనర్ కు తెలిపారు ఆమెతో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# అంగన్వాడీలకు నెల రోజులు వేసవి సెలవులు ఇవ్వాలి

### రాష్ట్ర కమిషనర్‌కు రాష్ట్ర నేతలు వినతి... పలు సమస్యల పరిష్కారానికి కమిషనర్ హామీ

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త. ప్రస్తుత వేసవి ఎండల దృష్ట్యా అంగన్వాడి కేంద్రాలకు మే నెల అంతా సెలవులు ఇవ్వాలని ఐసిడిఎస్ రాష్ట్ర కమిషనర్ వేణుగోపాల్ రెడ్డికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధుల బృందం గురువారం గుంటూరు లో కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి మినీ అంగన్వాడీ టీచర్లందరినీ, వెంటనే మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా జీవో ఇవ్వాలని కోరారు. కేంద్రాలకు పూర్తిస్థాయిలో చిన్నారులు రాలేని పరిస్థితి ఉందని, వెంటనే సంబంధిత మంత్రివర్యులతో మాట్లాడి, అంగన్వాడి కేంద్రాలన్నింటికీ వేసవి సెలవులు ఇప్పించాలని విజ్ఞప్తి చేసారు. అంగన్వాడి సెంటర్లకు సంబంధించి, మెయిన్ సెంటర్స్ గా ప్రకటిస్తామని ఇప్పటికే అనేక పర్యాయములు చెప్పారని, ఇప్పటివరకు జీవో రాలేదని వివరించారు. వెంటనే జీవో ఇస్తూ, మినీ టీచర్లకు కూడా వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త బాల సంజీవిని2.0.0 కి సంబంధించి, పనిచేసే సందర్భంలో చాలా అంతరాయాలు వస్తున్నాయని కమిషనర్ దృష్టి కి తీసుకువెళ్లారు. ఈబాలసంజీవిని కొత్త వర్షన్ కు సంబంధించి, అనేక సమస్యలు ఎదుర్కొంటూ, తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని, కొత్త బాల సంజీవిని 2.0.0 సంబంధించి సవరణల కొరకు, కొంతమంది లీడర్స్ను కొంతమంది వర్కర్స్ ను, పిలిపించి సమస్యలను కనుక్కొని, కొన్ని సవరణలు చేస్తే బాగుంటుందని చెప్పారు. ఈ పని పూర్తవకముందే, ఏడవ పోషకాహార ఉత్సవాలు కార్యక్రమము నిరంతరము పెట్టారని, ఒక పని అవ్వకముందే ఇంకొక పని పెడుతున్నందున క్రింది స్థాయిలో పనిచేయడానికి చాలా అంతరాయాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పని నిర్దేశించినప్పటికీ, కొంత సమయం ఇచ్చి పని చేయించాలని కోరారు. పైన పేర్కొన్న సమస్యలన్నీ త్వరలో పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఎం. సారమ్మ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వాణిశ్రీ, అరుణ మొదలగు కమిషనర్ ను కలిశారు. అనంతరం యూనియన్ నేతలతో కమీషనర్ మాట్లాడుతూ , అంగన్వాడి పిల్లలకి అటెండెన్స్ ఫోటోలు తీసివేసామని, ఇంకా బాల సంజీవిని కొత్త వర్షన్ లో, వివరంగా సవరణలు చేస్తామని, ఒకటి తర్వాత ఒకటి సవరించే పనిలో ఉన్నామని, ఇందుకు సంబంధించిన వారితో, 24వ తేదీ చర్చలు జరుపుకుందామని, వేసవి సెలవులది మంత్రి తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు



రాష్ట్ర కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నేతలు

యూనియన్ నేతలు తెలిపారు, సంక్షేమ పథకాలది త్వరలో పరిష్కారం చేస్తామని, మినీ టీచర్ల జీవో కోసం నిరంతరం అదే పనిలో ఉన్నామని, వీటన్నిటినీ వీలైనంత తొందరలో పరిష్కరిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలకు సంబంధించిన స్టాక్ లన్నీ, 5 వ తేదీ లోపల చేరేటట్లు, ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నామని కమిషనర్ పేర్కొన్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మే నెల 20 వ తేదీ నాడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో, రాష్ట్రంలో ఉన్నటువంటి అంగన్వాడి వర్కర్లు, మినీ వర్కర్లు,హెల్పర్లు పాల్గొంటున్నారని, అందుకు సంబంధించిన నోటీసును కూడా కమిషనర్కి ఇవ్వడం జరిగింది.

## పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

- ఒకే రోజు నాలుగు చోరీలు
- 60 తులాలు బంగారు, 3 కేజీలు వెండి, రూ.12లక్షలు నగదు చోరీ
- ఎస్సై ఇంట్లోనూ చోరీ
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీ వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రొద్దుటూరు పట్టణ రూరల్ ప్రజలు ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి ఒకే ఇంట్లో 60 తులాలు బంగారు, 3 కేజీలు పైచిలుకు వెండి, రూ.12లక్షలు నగదు చోరీ అయింది. టుటౌన్ ఎస్సై ధనుంజయ ఇంట్లో చోరీ జరిగింది. ఎంత మేర చోరీ జరిగిందో వివరాలు తెలియరాలేదు. మార్చి 8వ తేదీ లక్ష్మీనగర్‌లో చోరీ జరిగింది. 850 గ్రాములు బంగారు, 670 గ్రాములు వెండి, రూ.7లక్షలు నగదు చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. అలాగే హ్యాపీ హోంలో చోరీ జరిగింది. ఆర్టీపీపీ క్వాటర్స్‌లో ఉండే ఏఈలు రమేష్‌రెడ్డి, పద్మజా దంపతుల రూ.2.40లక్షలు విలువ చేసే నగలు చోరీ అయ్యాయి. అలాగే దొరసానిపల్లె, సాయి రాజేశ్వరి కాలనీలో దొంగతనానికి పాల్పడ్డారు. సీసీ పుటేజీలో దొంగల ఫొటోలు దొరికాయని తాలాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఎవరైనా ఇంటికి తాళాలు వేసి వెళ్లాలనుకుంటే ఇరుగు పొరుగు వారికి చెప్పి సంబంధిత పీఎస్‌కు సమాచారం తెలపాలన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను కొద్ది మేర కట్టడి చేయవచ్చన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండి దొంగతనాలకు పాల్పడే వ్యక్తులను అరెస్టు చేసి చోరీకి గురైన సొత్తును, నగదును రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రొద్దుటూరులో ఒకే రోజు 4 ఇళ్లలో చోరీ జరిగిన సందర్భంగా ప్రొద్దుటూరు పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తమై దొంగల కోసం వేట మొదలు పెట్టారు. ఇందులో భాగంగా చాపాడు మండలం రాజుపాలెం గ్రామ సమీపంలో ఓ కారులో వెళ్తూ వారు వెంబడించడంతో మహిళను, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయినట్లు తెలుస్తోంది. ఆ వాహనంలో మారణాయుధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి

మదనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త. చిరుత పులి మృతికి కారకులైన సంబంధిత అటవీ శాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన (బివైఎస్) అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బహుజన యువసేన బివైఎస్ ఆధ్వర్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చిరుత పులి మరణానికి కారణమైన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బహుజన్ యువసేన బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ మదనపల్లి మండలం పొన్నుట్యపాలెంలో ఇద్దరి పిల్లల గర్భం దాల్చిన ఆడ చిరుత పులి మరణించడంతో ఎంతోమంది తీవ్ర బాధకు గురయ్యారని, ఆ చిరుత పులి మరణానికి కారణం ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యమేనని పునీత్ ఆరోపించారు. చిరుతపులికి గన్‌షాట్ ద్వారా ఇంజక్షన్ ఇచ్చి బయటికి తీసి ఉండవచ్చని, కానీ అక్కడికి వచ్చిన ఫారెస్ట్ అధికారులకు కొంతమందికి గన్ ఎలా వాడాలో కూడా తెలియదని, తుపాకులు పనిచేయడం లేదని అధికారులు చెప్పడం చాలా బాధాకరమని పునీత్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారు ఉపయోగించే తుపాకులు పనిచేసే స్థితిలో ఉన్నాయా లేదా పనిచేయకపోతే వాటిని రిపేర్ చేయించి ఉపయోగపడే విధంగా పెట్టుకోవాల్సిన కనీస బాధ్యత ఫారెస్ట్ అధికారులకు లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇక్కడున్న ఫారెస్ట్ అధికారుల దగ్గర సరైన ఎక్విప్‌మెంట్స్ లేనప్పుడు దాదాపు 7 గంటలసేపు చిరుత పులి చిక్కుకొని ఉంటే కేవలం మూడు గంటల సమయంలో తిరుపతి నుండి మదనపల్లికి తిరుపతి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ద్వారా కావలసిన ఎక్విప్‌మెంట్‌ను తెప్పించి చిరుతపులిని కాపాడి ఉండవచ్చని, కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఆ ప్రయత్నం కూడా చేయకపోవడం వలన చిరుత పులి చనిపోయిందనన్నారు. జంతువులు అంతరించిపోతున్న సమయంలో ఉన్న వాటిని ఇలాంటి అధికారులు నిర్లక్ష్యంతో పోగొట్టుకోవడం చాలా బాధాకరమని, ఈ సంఘటనకు సంబంధించి విచారణ జరిపించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన యువ సేన నాయకులు శ్రీనివాసులు, జిలాని భాష, ఆది, వినయ్, బాలకృష్ణ, ద్వారక, వంశీ, శంకర్, జగదీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



### విద్యార్థులు లక్ష్య సాధన కోసం

# రాజీ లేకుండా కృషి చేయాలి

### పశు వైద్యుల వృత్తి పవిత్రమైనది : ఎమ్మెల్యే వరద




ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : విద్యార్థులు లక్ష్య సాధన కోసం రాజీ లేకుండా కృషి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం మండలంలోని గోపవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో కళాశాల డీన్ వీర బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన కళాశాల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ముందుగా కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్ కళాశాల వార్షిక నివేదిక చదివి వినిపించారు. అనంతరం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి హక్కుల కోసం పోరాడాలని సూచించారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం, వ్యవసాయం, పశు సంవర్థక శాఖ భారత ఆర్థిక వ్యవస్థలో దాదాపు 63 శాతం వాటా కలిగివుందని వివరించారు. వ్యవసాయంలో పశు సంవర్ధక శాఖ వాట అధికమన్నారు. తాను ఈ వెటర్నరీ శాఖలో భాగస్వామ్యం కావడం ఆనందకరమన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అధిక అవకాశాలు వున్నాయని, పశు వైద్యునికి చాలా గౌరవం వుందని, దేశ, విదేశాల్లో ఎన్నో ఉన్నత అవకాశాలు వున్నాయని వివరించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అవకాశాలు సద్వినియోగం చేసుకొని వృద్ధి లోకి రావాలని సూచించారు. లక్ష్య సాధనలో రాజీలేని పోరాటం చేయాలని తెలిపారు. కడపలో పశు వైద్య క్లినికల్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన పశు వైద్య విద్యార్థి గా వున్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం మ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ పశు వైద్యుల వృత్తి పవిత్రమైనదని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలకు ఎటువంటి మౌలిక సదుపాయాలు అవసరమైన కల్పిస్తామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడటం, తనను గుర్తుంచుకోవడం ఆనందకరమని తెలిపారు. నోరు లేని జీవులకు వైద్యం చేయడం చాలా పుణ్యకార్యమన్నారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జె.వి.రమణ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, యోగా, ధ్యానం పై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మ, కళాశాల ఓఎస్ఓ కళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలన

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త. అన్నమయ్య ప్రాజెక్టును జలవనరుల శాఖ జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ అబ్దు సమీ గురువారం పరిశీలించారు. ఇటీవలే ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు ఈఈ జయచంద్రరెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల పంపిన అంచనాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ఏ స్థాయిలో ప్రస్తుత పరిస్థితి ని ఆరా తీశారు. వివిధ మ్యాప్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డిఈఈ మురళీకృష్ణ, ఏఈఈ గురుమోహన్, హేమంత్, వెంకటరాముడు, వేణుగోపాల్ ఇంజనీర్లు ఉన్నారు.



# పురస్కారం అందుకున్న కళాకారుడు

**పీలేరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**


పురస్కారాన్ని అందుకుంటున్న ఖాదర్ బాష

కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ప్రముఖ బహుభాషా కళాకారుడు, పాత్రికేయుడు, సామాజిక సేవా కార్యకర్త ఖాదర్ బాష షేక్ అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం 2025 రాష్ట్ర స్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం మరియు జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయి. జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ఖాదర్ బాష షేక్ స్వీకరించారు. ఈయన గత 43 ఏళ్లుగా ప్రభుత్వ సక్షేమ, అభివృద్ధి పథకాల ప్రచార కార్యక్రమాలతో పాటు పలు సామాజిక, ప్రజా సమస్యలపై ఆధునిక వీధి నాటికలు ప్రదర్శించారు. గురువారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ 2025 సంవత్సరానికి తాను కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ పురస్కారోత్సవాలు ఇలాగే ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరుకుంటున్నానని ఖాదర్ బాషా చెప్పారు. తన ఈ ఉన్నతికి కారణమైన గురువులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు, మీడియా సోదరులకు ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# పందుల వీరవిహారం

**ఒంటిమిట్ట, ఏప్రిల్.17 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన ఒంటిమిట్టలో పందుల ప్రాబల్యం ఎక్కువ అవుతున్న నేపథ్యంలో చెత్తకుప్పల్లో, రహదారుల గుండా సంచరిస్తున్నా అధికారులు ప్రజాఆరోగ్యంపై దృష్టి పెట్టకుండా నిమ్మకు నీరెత్తే విధంగా తమకేమీ పట్టనట్టుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారంటూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రధాన రహదారుల్లో, గ్రామంలోని వీధుల్లో, చెత్తకుప్పల వద్ద పందులు పదుల సంఖ్యలో వీర విహారం చేస్తూ తిరుగుతున్న విషయాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న పందులను నిర్మూలించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండడం చాలా దురదృష్టకరమని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా పందుల వలన దోమలు ఎక్కువవుతుండడం చేత అనారోగ్య పరిస్థితులు వస్తున్నాయని తరచూ ఆస్పిటళ్లకి వెళ్ళవలసి వస్తుందంటున్నారు. కావున పంచాయతీ అధికారులు పందుల యజమానులను మందలించి, కాపాడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

### జాతీయ సంస్కృతి మరియు నాటకరంగం ఛైర్మన్‌గా ప్రభాకర్

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**



భారతీయ మానవ హక్కుల కమీషన్ మరియు భారతీయ మానవ అధికార పరిషత్తు, న్యూఢిల్లీ వారు ప్రొద్దుటూరు వాస్తవ్యుడు డాక్టర్ యం. ప్రభాకర్‌ని జాతీయ సంస్కృతి మరియు నాటకరంగం ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవి సంవత్సర కాలం పాటు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో భారతీయ సంస్కృతి మరియు నాటకరంగాన్ని బలోపేతం చేసేందుకు డాక్టర్ యం. ప్రభాకర్ సలహాలు, సేవలు అందిస్తారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యం. పవన్ కళ్యాణ్ మరియు నేషనల్ డైరక్టర్ డాక్టర్ అలోక్ కుమార్ పాఠక్ చేతుల మీద నియామక ఉత్తర్వులు అందుకున్నారు. డాక్టర్ యం. ప్రభాకర్ ప్రస్తుతం గవర్నమెంట్ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కి ఓఎస్డీగా అమరావతిలో సేవలు అందిస్తున్నారు.

# గంగమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

**చిన్నమండెం ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**



మండలంలోని వండాడి గ్రామం యర్రగట్ల వారిపల్లి సమీపంలో మాండవ్య నది వద్ద గురువారం ఆ గ్రామ ప్రజలు గంగమ్మ తల్లీ విగ్రహం ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారి కి 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు.పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు.ఇలా చేయడం వలన వర్షాలు విరివిగా వస్తాయని భక్తులకు ప్రగాఢ విశ్వాసం.ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం

**పీలేరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసిల్దార్

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసిల్దార్ భీమేశ్వరరావు అన్నారు. గురువారం పీలేరు మండలం గూడరేవు పల్లె పంచాయతీ పరిధిలో రీ సర్వే పను లు ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో మొత్తం 2600 సర్వే నంబర్లలో సర్వే ప్రక్రియ కొనసాగుతుందని ఆయన చెప్పారు. రైతులు భూ సమస్యలపై కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఫ్రీ సర్వేలో పాల్గొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు రైతులందరూ సహకరించి ఈ కార్యక్రమానికి హాజరై భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు ఇతీష్ మండల మండల సర్వేయర్ కీర్తన విఆర్ఓ హేమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డిటి సుబ్రమణ్యంకు ఘన వీడ్కోలు

**పీలేరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**


సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు నియోజకవర్గ రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ సుబ్రమణ్యంకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికి సాగనంపారు ఈయనకు పీలేరు నుంచి జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చినవి. ఈ ఉత్తర్వులు మేరకు పీలేరు తహసిల్దార్ బీమేశ్వరరావు రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను తహసిల్దార్ సహా రెవిన్యూ సిబ్బంది శాలువాలతో సత్కరించి సాగనంపారు.

# హజ్ కమిటీ సభ్యులుగా తాజ్ ఖాన్ నియామకం

**మదనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త.**

హజ్ కమిటీ సభ్యులుగా మాజీ సర్పంచ్, టిడిపి మైనార్టీ సీనియర్ నాయకులు తాజ్ హోటల్ నిర్వహకులు పఠాన్ ఖాదర్ ఖాన్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా నూతనంగా నియామకమైన హజ్ కమిటీ సభ్యులను సాల్వ్ కప్పి సన్మానించారు. అనంతరం పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తనయుడు అక్బర్ జువైద్, మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ ఏ.మస్తాన్, పట్టణంలోని టిడిపి నాయకులు ఆయనను అభినందించారు.



# వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రేపు భారీ ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :**




ఈ నెల 19వ తేదీ శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటల నుండి స్థానిక వన్ టౌన్ వద్దనున్న ముబారక్ షాది మందిర్ వద్ద నుండి శివాలయం సెంటర్ వరకు భారీగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రొద్దుటూరు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. ప్రొద్దుటూర్ జేఏసీ మెంబర్ సలీమ్ బాష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేఎం అబ్దుల్ సుభాన్ వస్తున్నారని కావున ప్రొద్దుటూర్ మరియు పరిసర ప్రాంతాలలోని మహిళలు, పురుషులు,ప్రజలు ముస్లింలు, లౌకిక వాదులు, ప్రజాస్వామ్య వాదులు అందరూ కులమతాలకు అతీతంగా ఈ ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మెంబర్స్ తాజుద్దీన్, హిదాయతుల్లా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు మార్గంలో సమస్యలు పరిష్కరించండి

## రైల్వే శాఖ సహాయ మంత్రికి నాగోతు విజ్ఞప్తి

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**



రేణిగుంట గుంతకల్ రైలు మార్గంలో దీర్ఘ కాలంగా తిష్ట వేసుకొని పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర బిజెపి కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు గురువారము ఢిల్లీలో రైల్వే శాఖ సహాయ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాజంపేట రైల్వేకేంద్రంలో సగంలో ఆగిపోయిన రైల్వే అండర్ బ్రిడ్జిని గతిశక్తి పథకం క్రింద వందశాతం నిధులు కేంద్రం ఖర్చు పెట్టి మిగిలిపోయిన పనులు పూర్తి చెయ్యాలని కోరారు. ఓబులవారిపల్లి కృష్ణపట్నం రైలు మార్గం గుండా ప్యాసింజర్ రైళ్లు నడిపితే నెల్లూరు, అమరావతి వెళ్లే అన్నమయ్య, కడప జిల్లాల ప్రజలకు 100 కిలోమీటర్లు దూరం తగ్గి సమయం, డబ్బు ఆదా అవుతుందని విజ్ఞప్తి చేశారు. సంపర్క క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు రాజంపేట రైల్వే స్టేషన్ లో అనుమతి వున్న నిలబడడం లేదన్నారు. అలాగే ఇదే రైల్వేకేంద్రంలో కోవిడ్ సమయంలో ఆగిపోయిన చెన్నై ముంబాయి ఎక్స్ ప్రెస్ రైలుతో పాటు అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ వసతిని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. దీనిపై రైల్వే శాఖ సహాయ మంత్రి రాజంపేట రైల్వే కేంద్రంలో స్టాపింగ్ వసతి కలిగిన రైళ్లన్నింటినీ వెంటనే ఆపాలని విజ్ఞప్తి మేరకు వెంటనే సంబంధిత అధికారులకు త్వరితగతిన నిర్ణయాలకు నేరుగా ఆదేశాలు జారిచేయడం సంతోషకరమని రమేష్ నాయుడు అన్నారు.

# అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

**ముద్దనూరు,ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**



మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన రైతు మడక రామకృష్ణ అప్పుల బాధ తాళలేక ఇంటి సమీపంలోని ఓ పొలంలో వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తుల తెలిపిన వివరాల మేరకు నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పలు రకాల పంటలు పండించి నష్టం రావడంతో మనస్థాపానికి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి ఎస్ఐ మైనుద్దీన్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**సుండుపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రాయలసీమ హరిజన గిరిజన వెనుకబడిన తరగతులు మైనార్టీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్.బి.ఐ వారి సహకారంతో డిపాజిటెడ్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ ఫండ్ కార్యక్రమంపై మండలంలోని అన్ని గ్రామాల ఆశ కార్యకర్తలకు సంస్థ ప్రతినిధి బివి రత్నం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చాలామంది అవగాహన లేక బ్యాంకు ఖాతాలు లావాదేవీలు జరగకుండా నిలిపివేయడం, ఖాతాలకు నామినీలను జత చేయకపోవడం, మొబైల్ లింకు, ఆధార్ లింకు, పాన్ కార్డు లింకు చేయకపోవడం వలన ఈ సమస్య అంతా కూడా డి ఇ ఎ క్రింద ఆర్బిఐకి చేరుతుందని అందువలన మన అకౌంట్ కి నామిని పేరును అప్లోడ్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళా జాతర బృందం వారిచే ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ బీమా పథకాలు, మరియు సైబర్ నేరాలు గురించి క్లుప్తంగా పాటల రూపంలో మరియు మ్యాజిక్ రూపంలో ఆశా కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ హరిజన గిరిజన వెనుకబడిన తరగతులు మైనార్టీ సంస్థ నుంచి జేరాసరాయుడు ఎం వెంకటయ్య మరియు బి చంద్ర నాయకులు పాల్గొన్నారు.

# పేకటరాయుళ్లు అరెస్టు

**ముద్దనూరు ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండలంలోని కోసినేపల్లె గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పంట పొలాల సమీపంలో లోపల బయట అనే పేకాట జూదాన్ని ఆడుతున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ కు సమాచారం రావడంతో గురువారం నాడు సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10150 రూపాయల నగదు మరియు 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# మండల మీట్‌ను బహిష్కరించిన వైసీపీ ఎంపీటీసీలు

**ముద్దనూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మండల అధ్యక్షుల సమక్షంలో నిర్వహించాల్సి నా సమావేశాన్ని వాయిదా వేసినట్లు మండల పరిపాలన అధికారి పరిపూర్ణ అరుంధతి దేవి తెలిపారు. వైసీపీ ఎంపీటీసీలకు మరియు మండల కో ఆప్షన్ కు ఏడాది నుంచి రుణ వేతనాలు అందలేదని, ప్రతి సమావేశానికి హాజరు నిమిత్తం మమ్మల్నిఆహ్వానిస్తున్నారే తప్ప అభివృద్ధిపై నిధులపై ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడానికి మాత్రమే సభ్యులను ఆహ్వానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆరుగురు వైసిపి ఎంపీటీసీలు మండల కో ఆప్షన్ సమావేశాన్ని బైకాట్ చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి వారి శాఖ అభివృద్ధి, పలు సమస్యలపై హాజరైన మండల అధికారులు సమావేశం వాయిదా పడడంతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఈ సమావేశాన్ని మరలా తిరిగి మండలాధ్యక్షుల అనుమతితో రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని మండల పరిపాలన అధికారి (ఏవో) విలేకరులకు తెలిపారు.

# ఐటిఐ కళాశాలలో మెగా జాబ్ మేళా

**ముద్దనూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

పట్టణ పరిధిలోని తాడిపత్రి రహదారి సమీపం లోని గజ్జల చిన్న రంగారెడ్డి ఐటిఐ కళాశాల ఆవరణలో20వ తేదీ ఆదివారం నాడు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని జువారి సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహించుటకు పదవ తరగతి పాస్ అయిన నిరుద్యోగ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని చదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలి

**మదనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త.**




బీటీ కళాశాల యూనివర్సిటీగా చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో బీటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలని, బీటీ కళాశాలకు పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీని, నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలన్నారు. ఇప్పటికే కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తూ పేద ప్రజల యొక్క రక్త మాంసాలను జలగల పీడిస్తున్నారని అన్నారు. అలాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు చైనా కార్పొరేట్ విద్యాసంస్థలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వాటి పైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు సర్వేపల్లి, రమణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# హజ్ కమిటీ మెంబర్‌గా షేక్ మహబూబ్ బాషా

**పులివెందుల, ఏప్రిల్17,ప్రభాత వార్త:**



పులివెందుల ప్రాంతానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ మహబూబ్ బాషా స్టేట్ నామిటేడ్ హజ్ కమిటీ మెంబర్‌గా నియామకం అయినట్లు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపి హజ్ కమిటీ యాక్టు ప్రకారం 13 మంది హజ్ కమిటీ సభ్యులను నామినేట్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు 3 సంవత్సరాలు ఈ పదవుల్లో కొనసాగుతారు.ఈ సందర్భంగా షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలకు సేవలు అందిస్తూ మళ్లీ 2029లో చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు తన వంతు శక్తివంచన లేకుండా పార్టీ కోసం కృషి చేస్తామన్నారు. నమాజ్ టోపీ తోడిగి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత మాజీ ప్రధాన కార్యదర్శి షేక్.సమద్ మరియు టి.ఎన్.ఎల్.ఎఫ్ షేక్. అక్రమ్, మహబూబ్ బాషా, హుస్సేన్, షరీఫ్, ఖలీద్, ఇర్ఫాన్, సాల్మాన్, ఫయాజ్, మస్తాన్, ఖాదర్ మరి కొంత మంది మైనార్టీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# దాడి ఆటవికం..

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**



అన్యాయంగా మాపై కేసు బనయించడమే కాకుండా.. వాయిదా కోసం కోర్టుకు వెళుతున్న సమయంలో ప్రత్యర్థులు కాపు కాచి దాడి చేయడం ఆటవికమని బాధితుడు షబ్బీర్ అహ్మద్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అల్మాస్పేటలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కుటుంబ కలహాల కారణంగా అన్యాయంగా తమపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై కొంతమంది దాడి చేయించారని ఆరోపించారు. గాయపడిన తాను ఈనెల 7 తేదీన రిమ్స్ లో చేరి చికిత్స పొందినట్లు పేర్కొన్నారు. కేసు పెట్టిన మేము భయపడలేదని, మళ్లీ మాపైన దాడి చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మాకు న్యాయం కావాలని జిల్లా అధికారులను కోరారు.

# పురస్కార గ్రహీతకు యుటిఎఫ్ ఘన సన్మానం

**పీలేరు ఏప్రిల్ 17 ప్రభాతవార్త :**



కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ప్రముఖ బహుభాషా కళాకారుడు, పాత్రికేయుడు, సామాజిక సేవా కార్యకర్త ఖాదర్ బాష షేక్‌ను యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం 2025 రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం మరియు జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఇందులో కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ఖాదర్ బాష షేక్ ను గురువారం పీలేరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీలేరు, కెవి పల్లి మండలాల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పి రెడ్డి బాష మాట్లాడుతూ ఖాదర్ బాష రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో ఉన్నతమైన పురస్కారాలను అందుకోవాలని, పీలేరు కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# పారదర్శకంగా భూముల రీసర్వే

**గాలివీడు, ఏప్రిల్ 17(ప్రభాతవార్త):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేట్టిన భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోపనపల్లె గ్రామంలో రీసర్వేపై అవగాహన కల్పిస్తూ రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో కొత్తగా భూసర్వే చేసి హద్దులు నిర్ధారించనున్నట్లు తెలిపారు. మారిన ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం గ్రామాల్లో భూవివాదాల పరిష్కారంతో పాట రికార్డులను నవీకరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సర్వే బృందం ఒక్కో బ్లాకుగా విభజించుకుని షెడ్యూల్‌ను తయారు చేసుకుని పారదర్శకంగా రీసర్వే జరిపించడం జరుగుతుందన్నారు.

# దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నం

**గాలివీడు, ఏప్రిల్ 17(ప్రభాతవార్త):**

అభం శుభం తెలియని దివ్యాంగురాలుపై రేపన వెంకటరమణ దాడికి పాల్పడ్డాడంటూ గురువారం కుటుంబసభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. గ్రామస్తుల కథనం మేరకు మండలంలోని కమలామర్రి గ్రామం పెద్దపల్లెలో నివాసం ఉంటున్న బాధితురాలు యశోద పుట్టుకతో దివ్యాంగురాలు. అదే గ్రామానికి చెందిన రేపన ఆంజనేయులు కుమారుడు వెంకటరమణ మద్యానికి బానిసై భార్యతో గొడవపడి కొంతకాలంగా ఆమెకు దూరంగా ఉంటున్నాడు. ఇదే క్రమంలో కామంతో కళ్లు మూసుకుపోయిన వెంకటరమణ బుధవారం మధ్యాహ్నం తన కోరిక తీర్చుకోవాలన్న దుర్బుద్ధితో ఆ దివ్యాంగురాలిని నిర్దాక్షిణంగా ఇంటిలోకి లాక్కెళ్లి మృగంలా ప్రవర్తిస్తూ ఆ అమాయకురాలిపై లైంగిక దాడికి విశ్వ ప్రయత్నం చేశాడు. బిగ్గరగా అరుపు లు, శబ్దాలు రావడంతో చుట్టుపక్కల నివాసముంటున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరమణ చెర నుండి బాధితురాలిని రక్షించారు. ఇదిలా ఉండగా అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు.

# డా.శ్రీవాణి బాధ్యతలు స్వీకరణ

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మెడికల్ సూపరింటెండెంట్‌గా డా.శ్రీవాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు మెడికల్ సిబ్బంది, అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# అబ్యాస్ అబాకస్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**సుండుపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ నందు ఫ్రీ ప్రైమరీ నుంచి యూకేజీ ఫస్ట్ క్లాస్ కు ప్రమోట్ అయిన వారికి మరియు ప్రైమరీ నుండి హైస్కూల్ కు 5 తరగతి నుండి 6వ తరగతి వారికి కన్ ప్రి కేషన్ సర్టిఫికెట్ మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్ నాయక్, ఎంఎన్ఆర్ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, రాయచోటి శ్రీ మేధా హై స్కూల్ కరస్పాండెంట్ భానుమూర్తి, చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. హైదరాబాద్ అభ్యాస్ ఐటిఐ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎస్ వెంకట మోక్షిత్, ఎస్ తీన్మయి సాయి సౌమ్య, మొదలగువారు మరియు అబాకస్ మ్యాథమెటిక్స్ పోటీ పరీక్ష నందు జిల్లాస్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులు రిదా, నిహారిక, సోహెల్ మొదలగు వారు బహుమతులు సాధించారు. లిటిల్ ఫ్లవర్ కరస్పాండ్ నాగేశ్వరావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# ఎస్ఆర్ఐటీలో గెస్ట్ లెక్చర్

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డేటా స్ట్రక్చర్స్ అనే అంశంపై ఎన్ఐటీ వరంగల్ సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఆర్‌బీవీ సుబ్రమణ్యంతో మొదటి సంవత్సరం సీఎస్ఈ మరియు ఏఐఎంఎల్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. గెస్ట్ లెక్చర్‌లో భాగంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యార్థులు డేటా స్ట్రక్చర్ రియల్ టైం అప్లికేషన్స్ వినియోగించి అరిఫిషల్ ఇంటలిజెన్స్ సిస్టం డెవలప్‌మెంట్ సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీస్‌లో డేటా స్ట్రక్చర్స్ అల్గారిథమ్స్ ప్రాముఖ్యతను అలాగే క్లిష్టమైన సమస్యలను డేటా స్ట్రక్చర్స్ అల్గారిథమ్స్ ఉపయోగించి సమస్యలకు పరిష్కారం తెలుసుకోవడం తదితర సమస్యలను సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ డా.వై.సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ సునీల్, డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు. ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ఇటువంటి గెస్ట్ లెక్చర్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ బాలుర వసతి గృహం విజిట్

**కడప లీగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.బాబాఫకృద్దీన్ గురువారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం విజిట్ చేయడం జరిగింది. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత మరియు పరిశుభ్రత ఆహారం మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి పిల్లలు ఏఏ తరగతులను అభ్యసిస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2024 వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 మొదలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, వైద్యాధికారిని లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్లే కార్డులు ప్రదర్శన నిరసన



**మైదుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మైదుకూరు డిపో నందు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో ఉద్యోగులు సమస్యలను ప్లే కార్డులు చేతపట్టి నిరసన తెలియ జేస్తూ గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో డిపో సెక్రటరీ వి.ఎస్.రాయుడు,డిపో అధ్యక్షులు ఎస్.నాగరాజు, గ్యారేజ్ కార్యదర్శి వై.ఎస్.రాయుడు, సి.సి.ఎస్ డెలిగేట్, ఎన్.వి.నరసింహులు, ఎస్.బి.రెడ్డి, ఏపీ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ 1/19 సర్కులర్ అమలుచేయాలని, అక్రమ సస్పెన్షన్, అక్రమ రిమూవల్ లను వెంటనే ఆపాలని, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓ.డి.లు కేటాయించాలి, ఈ.హెచ్.ఎస్. స్థానంలో పాత వైద్యం పునరుదరించాలని నినాదాలతో ప్లే కార్డ్స్ చేతపట్టి బస్టాండ్ చుట్టూ తిరుగుతూ నిరసన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో యం.పురుషోత్తం,కె.వి.ఎస్.రెడ్డి,జి.ఆర్.రెడ్డి, పోలయ్య, జి.ఆర్.ఎస్.రెడ్డి, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి రక్తదానం

**లక్కిరెడ్డిపల్లి; ఏప్రిల్ 17, ప్రభాతవార్త**



మంత్రి మల్లెపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె మండల తెలుగు యువత అధ్యక్షుడు ఫకీరయ్య ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితులలో ఆపరేషన్ కోసం రాయచోటి గవర్నమెంట్ హాస్పిటల్‌లో సీరియస్ ఉన్న బాలింతకు లక్కిరెడ్డిపల్లికు చెందిన వేల్పుల సుధాకర్ ఆపదలో ఉన్న వారికి వెంటనే రక్తదానం చేశారు. ఒక ప్యాకెట్, గవర్నమెంట్ హాస్పిటల్ లో దీప బ్లడ్ బ్యాంక్ నుంచి ఎక్స్చేంజ్ చేసి మరొక ప్యాకెట్ స్వచ్ఛందంగా ఇచ్చి లక్కిరెడ్డిపల్లి లో అన్నా మోలా అను అతని భార్యకు రెండు ప్యాకెట్లు రక్తాన్ని దానం చేశారు సుధాకర్ సకాలంలో రక్తం దానం చేయడంతో ఇద్దరు వ్యక్తులకు ప్రాణం పోశారని డాక్టర్లు కొనియాడారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ఉద్యమాలు తప్పవు

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**




విద్యుత్ ఛార్జీల పెంపుతో పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని వైఎస్ఆర్సిపి కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం కడప వైసీపీ కార్యాలయంలో విలేకరులతో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కరెంట్ ఛార్జీలు పెంచమని ప్రగల్బాలు చెప్పి అధికారంలోకి వచ్చాక అన్ని వస్తువుల రెట్లు పెంచేశారు. నిత్యవసర సరుకుల ధరలు, డీజీలు, వంటగ్యాసు వంటివి పెంచారని మండిపడ్డారు. విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయని, రూ.6450 కోట్ల గత డిసెంబర్ లో పెంచారు.. మళ్ళీ ఇప్పుడు 9 వేల కోట్ల రూపాయలు ఛార్జీలు పెంచారని తెలిపారు. రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. రూ.1.65 వేల కోట్లు అప్పులు చేశారని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చేరిగారు. ఛార్జీలను తగ్గించుకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసీపీ నేతలు పులి సునీల్ కుమార్, శ్రీరంజన్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, షఫీ, జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన




మైదుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ బి. సత్యరాజు ఆధ్వర్యంలో మైదుకూరు అగ్నిమాపక సిబ్బంది కేంద్రం నుండి బయలుదేరి బద్వేల్ రోడ్డు నందు ఉన్న శ్రీ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ నందు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కరపత్రాలు పంచి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బహుళ అంతస్తులు ఏ విధంగా బయటికి రావలెను, పొగ గదిలో చిక్కుకున్న వారిని ఎలా బయటికి తీసుకొని, రావలెను నీళ్లలో పడిన వాళ్లను ఎలా రక్షించవలెను,రెస్క్యూ మెథడ్స్ మరియు గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనేది ప్రయోగపూర్వకంగా చూపించి అగ్నిమాపక విన్యాసాలు చేయడం అయినది. ఈ కార్యక్రమం నందు సిస్టర్ మేరీ బెర్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొనడం జరిగింది. ప్రజలు, విద్యార్థులు, వ్యాపార సంస్థల యజమానులు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 101 కు ఫోన్ చేయమని తెలిపారు.

# సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్మెంట్ విద్యార్థుల వీడ్కోలు

రాయచోటి ఏప్రిల్ 17 ప్రభాతవార్త
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నాడు మేనేజ్మెంట్ విభాగపు ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూప్రపంచం వేగంగా మారుతున్న ఈ యుగంలో, ప్రతి రంగంలోనూ సమర్థత, వ్యూహాత్మక ఆలోచన, నాయకత్వం అవసరాలను తీర్చగల శక్తి, మేనేజ్మెంట్ విద్యలో ఉందని అభిప్రాయపడ్డారు.ఇది సాధారణంగా వ్యాపార పరంగా మాత్రమే కాకుండా, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ పరిపాలన, సాంకేతికత వంటి విభిన్న రంగాలలోనూ మార్గదర్శక శక్తిగా నిలుస్తోంది. మేనేజ్మెంట్ విద్య ద్వారా విద్యార్థులు సమస్యలను విశ్లేషించగల సమర్థత, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, మరియు బృందాలను సమర్థవంతంగా నడిపించే నాయకత్వ గుణాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన మేనేజ్మెంట్ విద్య ద్వారా కేవలం ఉద్యోగాన్నే కాకుండా, స్వయం ఉపాధిని సృష్టించగల వ్యాపారవేత్తలుగా ప్రపంచ స్థాయి ప్రతిభావంతులుగా యువత రాణించాలని అభిప్రాయపడ్డారు. మేనేజ్మెంట్ విద్య అనేది కేవలం ఉద్యోగ సాధన మార్గం మాత్రమే కాకుండా అది సమాజ నిర్మాణానికి ఒక శక్తివంతమైన సాధనంగా గుర్తించాలనిఅభిలాషించారు. మేనేజ్మెంట్ విభాగాధిపతి కే. ఇంతియాజ్ మాట్లాడుతూ డిజిటల్ యుగం ప్రారంభమైన తర్వాత, ఆన్లైన్ మరియు హైబ్రిడ్ మోడళ్లలో మేనేజ్మెంట్ కోర్సులు అందుబాటులోకి రావడంతో, మేనేజ్మెంట్ విద్య మరింత విద్యార్థులకు చేరువైందని, ఇందులో నూతన ధోరణులు డేటా ఎనాలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సస్టైనబిలిటీ, స్టార్టప్ కల్చర్ – ఇవన్నీ విద్యార్థులలో నూతన ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలియజేశారు. ఈ రంగంలో పరిశ్రమలతో అనుబంధం, ఇంటర్న్షిప్‌లు, రియల్ టైమ్ ప్రాజెక్టులు వంటి అవకాశాలు విద్యార్థులకు పుష్కలంగా లభిస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థుల విద్యార్థులు పాల్గొన్నారు.



# డయేరియా పక్షోత్సవాలపై సమావేశం



బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 17 , ప్రభాతవార్త
కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే డయేరియా పక్షోత్సవాల సందర్భంగా మునిసిపల్ కమీషనర్ నరసింహ రెడ్డి అధ్యక్షతన పురపాలక సభా భవనంనందు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ డయేరియాను నిర్మూలించడానికి ముఖ్యంగా నిర్జలీకరణను నివారించడానికి నీరు, రసాలు మరియు సూప్ వంటి ద్రవాలను తీసుకోవడం సహాయపడుతుంది. అలాగే, సురక్షితమైన నీరు మరియు పారిశుద్ధ్యం పాటించడం ద్వారా డయేరియా ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. శానిటేషన్ సెక్రెటరీ లు పారిశుధ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు కలుషితం లీకేజీ లు లేకుండా చూడాలని అమెనిటీస్ సెక్రెటరీ లకు సూచించారు. హెల్త్ సెక్రటరీ లు వార్డ్ లలో తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అంగన్వాడీ సూపర్వైజర్, శానిటేషన్ సెక్రెటరీలు, అమెనిటీస్ సెక్రటరీలు,హెల్త్ సెక్రటరీలు మరియు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్‌తో
## సులభతరం కానున్న రిజిస్ట్రేషన్ సేవలు.



చిట్వేలి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వం తీసుకున్న స్లాట్ బుకింగ్ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం కానున్నట్లు మండల సబ్ రిజిస్టర్ మారుతి వర ప్రసాద్ అన్నారు. గురువారం తాను మాట్లాడుతూ ఈ రిజిస్ట్రేషన్ ద్వారా గంటల తరబడి వేచి ఉండే ఇబ్బంది ఉండదన్నారు. ఈ సేవల్లో తమ వ్యక్తిగత మరియు ఆస్తుల వివరాలను పొందుపరచడంతో రసీదు పొందవచ్చన్నారు. ఆ రసీదుతో తమకు కేటాయించిన సమయంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా 20 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మండల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. క్యూఆర్ కోడ్ లేదా పబ్లిక్ డాటా ఎంట్రీ వెబ్సైట్ లేదా ఐజిఆర్ఎస్ వెబ్సైట్ లోకి వెళ్లి మూడు విధానాల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ముఖ్యంగా రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట గంటల తరబడి వేచి ఉండనవసరం లేదన్నారు. భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, వివాహ ఇతరత్రా అన్ని రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ వ్యవస్థ అమలు కాబోతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుకోవాలనుకునేవారు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుంటే, ఆ తేదీనే, ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సబ్ రిజిస్టర్ మారుతి వర ప్రసాద్ తెలిపారు.

# యోగ శ్రీ సర్టిఫికెట్ల ప్రధానం

పీలేరు ఏప్రిల్ 17 ప్రభాతవార్త:
స్థానిక వి.ఎస్.ఎన్ విద్యాసంస్థల్లోని స్మార్ట్ కిడ్స్‌లో షీ దివ్య యోగ విద్యాలయంచే యోగ శ్రీ అవార్డ్స్ బహుకరణలో భాగంగా యోగలో యోగా మాస్టర్ పి.వీ.ఎస్ లక్ష్మి ద్వారా శిక్షణ పొందిన నాలుగు మరియు ఐదవ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్స్ ను మరియు మెడల్స్ ను ప్రధానం చేయడం జరిగింది అని షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పివిఎస్ లక్ష్మి న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల్ సుధాకర్ రాయల్ తెలియజేశారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వి.ఎస్.ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి ప్రిన్సిపల్ పగడాల శోభారాణి ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ పంపిణీ చేయడం జరిగినదని షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి మరియు షీ సంస్థ న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు పత్రికా ముఖంగా తెలియజేశారు.

**వేసవి యోగ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి:**
పీలేరు పరిసర ప్రాంత చిన్నారులకు ముఖ్య గమనిక ఈనెల 25వ తారీఖున స్థానిక షీ దివ్య యోగ విద్యాలయం కోటపల్లి రోడ్డు నందు ప్రారంభమగు వేసవి యోగశిక్షణా కార్యక్రమానికి అందరూ నమోదు చేసుకోవాలని సంస్థ అధ్యక్షులు తెలియజేశారు.



# మత్స్యకారుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

బి. మఠం మత్స్యకార సంఘం...



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 17 ప్రభాతవార్త:
రాష్ట్రంలో ఉన్న మత్స్య కారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన ధ్యేయం అని బ్రహ్మంగారిమఠం మండల మత్స్యకార సంఘం, తెలుగుదేశం నాయకులు బోలా శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం, ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుందని, దానిలో భాగంగానే మత్స్య కారులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తుంది అని ఆయన అన్నారు. రాష్ట్రంలో కేవలం సముద్ర లో చేపల వేట చేసుకొని జీవనం కొనసాగించే వారి కోసం ఈ నెల 26 వ తేదీన మత్స్యకారులకు 10 వేలను 20 వేల రూపాయలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం చాలా సంతోసమని ఆయన అన్నారు. చేపల వేట నిషేధమైన జులై, ఆగష్టు నెలలో మత్స్య కారులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా వారికి 20వేల రూపాయలు ఇవ్వడం చాల సంతోషం అని అన్నారు.

**మత్స్యకారులకు కూడా న్యాయం చేయండి**
చేపల వేట నిషేధం అయినా ఆ రెండు నెలల్లో కేవలం సముద్ర తీర ప్రాంతాల వారికీ ప్రభుత్వం 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని, కానీ రాయలసీమ జిల్లాలలో కూడా, చెరువులు, డ్యాం లలో చేపలు పట్టుకొని జీవనం సాగించే వారు చాల మంది ఉన్నారని, అలా చేపల వేట చేసే వారిని, వారికి ఉన్న లైసెన్సులను గుర్తించి, వారికి కూడా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇచ్చేలా ఆలోచించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని మత్స్యకారులు ఎప్పటికీ రుణపడి ఉంటారని ఆయన తెలిపారు.

# కార్మికుల సమస్యల మున్సిపల్ కమిషనర్‌కు వినతి

బద్వేలు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త
మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వి.వి నరసింహారెడ్డి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ అధ్యక్షులు శ్యాం ప్రవీణ్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను తాము అధికారంలోకి వస్తే కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆప్కాస్ సంస్థను రద్దుచేసి, ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పగించే కుట్రపూరితమైన విధానాన్ని అమలు చేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేసుకొని కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని, గత రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్,దాహన సంస్కారాల నిధి పెంపు, రిటైర్మెంట్ వయసు పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపు తదితర అంశాలకు జీవోలు జారీ చేయకుండా నిర్లక్ష్యం వహించడం ప్రభుత్వానికి తగదని,చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా మరియు ఉపాధి కల్పించాలని, 60 సంవత్సరాలు నిండాయనే సాకుతో బలవంతంగా విధుల నుండి నిలుపుదల చేయడాన్ని విరమించుకోవాలని,ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను కూడా 62 సంవత్సరాల కు పదవీ విరమణ చేయాలని, పదవి విరమణ చేసేటప్పుడు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఐదు లక్షల రూపాయలు చెల్లించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కోవిడ్ 19 అదనపు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్త 16 రోజుల సమ్మె కాలానికి జీతం చెల్లించాలని, పెరుగుతున్న పట్టణ జనాభా విస్తీర్ణం దృష్ట్యా కార్మికుల సంఖ్యను పెంచాలని మరియు తదితర సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని లేని పక్షంలో రానున్న కాలంలో స్థానికంగా నిరవధిక సమ్మె చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, యూనియన్ కార్య నిర్వాహక అధ్యక్షులు దియ్యాలహరి, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు,బద్వేలు ప్రవీణ్ కుమార్, కోశాధికారి కాలువ శివ కుమార్, కమిటీ సభ్యులు ఇండ్ల చంద్రశేఖర్ కార్మికులు చిన్నరాజు,బాబు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



# పంట నష్టాన్ని ప్రామాణికంగా బీమా చెల్లించాలి

పులివెందుల, ఏప్రిల్17, ప్రభాత వార్త:



పెనుగాలులు వడగండ్ల వానకు మూడు వారాల లోనే లింగాల మండలంలోని పెద్ద కుడాల, చిన్నకుడాల, రాముట్లపల్లి, తాతిరెడ్డి పల్లి, కోమన్నూతల తదితర గ్రామాలలో 2150 ఎకరాల నేల మట్టం అయిందని, ప్రభుత్వం ముందుకు వచ్చి నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకోవాలి అని వైయస్సార్ కడప జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం లింగాల మండలంలో మొన్న వీచిన పెను గాలులకు దెబ్బ తిన్న అరటి పంటను ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పంట నష్టాన్ని ప్రామాణికంగా చేసుకొని రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ అందించాలన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వెదర్ టెస్ట్ ప్రకారం భీమా వస్తోంది అని కానీ లింగాల మండలంలో ఎక్కడా కూడా విండ్ టెస్టింగ్ పరికరాలు పనిచేయలేదని దీనివలన నిజంగా నష్టపో యిన రైతులకు సబ్సిడీకి దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం ఎకరాకు 14 వేల రూపాయలు మాత్రమే అందిస్తుందని ఆ ఇచ్చిన సొమ్ము నేల పాలైన అరటి పంటను శుభ్రం చేయడానికి కూడా సరిపోదు అన్నారు. కనీసం అంటే ఎకరాకు లక్ష నుంచి రెండు లక్షల వరకు ఖర్చు వస్తుందని దీని ప్రకారం మూడు వారాల్లోనే ఒక లింగాల మండలంలోని రైతులకు దాదాపు 42 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మార్చి నెలలో సంబంధిత అధికారులు కూడా బ్రదర్ టెస్టింగ్ పరికరాలు పనిచేయలేదని కలెక్టర్ కు తెలియజేశారని కావున విండో టెస్ట్ ప్రకారం కాకుండా పంట నష్టాన్ని బట్టి రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ మరియు భీమా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, లింగాల మండల వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాములోనే గోవులు మృత్యువాత

ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆరోపణ



మదనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త.
వైసీపీ ప్రభుత్వం హయాంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గోశాలలో పాడి ఆవులు మరణించాయని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆరోపించారు. టీటీడీ గోశాలలో గోవుల మరణాలపై భూమా కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలను సవాలు చేస్తూ, చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఎమ్మెల్యేలు గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన పాడైపోయిన మందులు, దాణా తిని గోవులు మరణించాయని ఆరోపించారు. గోవుల మరణానికి సంబంధించిన నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. వైసీపీ పాలనలో టీటీడీలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో అన్ని పనులు సక్రమంగా జరుగుతున్నాయనన్నారు. టీటీడీ లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# ప్రాథమిక పాఠశాలలో చేర్పించండి



లక్కిరెడ్డిపల్లె; ఏప్రిల్ 17, ప్రభాతవార్త
అంగన్వాడి కేంద్రాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రీస్కూల్ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ చక్రనాయకుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనంతపురం ఈడిగపల్లి హరిజన వాడ, వడ్డేపల్లి గ్రామాలలో పర్యటించి అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులను ప్రాథమిక పాఠశాల జరిపించాలని ఉపాధ్యాయులకు పిల్లల తల్లి దండ్రులకు సూచించారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో ఈనెల 21 తేదీ లోపు చేర్పించాలన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నాణ్యమైన విద్యుత్ తో పాటు మధ్యాహ్న భోజనం అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఆయన తల్లిదండ్రులకు తెలియజేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు సమ దుస్తులు అన్ని ప్రభుత్వ అందిస్తుందని ప్రతి విద్యార్థి ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సుబ్బరాయుడు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవం



మైదుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:
మైదుకూరు పట్టణం వనిపెంట రోడ్డులో ఉన్న శ్రీ శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవము జరుపుటకు మైదుకూరు గ్రామ పెద్దలు మరియు ప్రజల ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం కొలత, శనివారం శుద్ధ భూతి రాత్రి 8 గంటలకు ఆర్కెస్ట్రా, ఆదివారం బోనాలు, సుడిబండి ఉత్సవము, సోమవారం వృషభరాజ్యములచే రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు జరపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థలం దాత కీర్తిశేషులు మాలపాటి నారాయణ శ్రేష్టి, ఆలయ పునరుద్ధరణ దాత కీర్తిశేషులు కసెట్టి పార్వతి మరియు కీర్తిశేషులు కసిటి నరసింహులు, లక్ష్మీ బిల్డర్స్ హైదరాబాదు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ విద్యుత్ అలంకరణతో పాటు విస్తృతంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దాతలు కూడా సయా సహకారాలు అందించారని ఆలయ పెద్దలు తెలిపారు. మైదుకూరు పట్టణ ప్రజలు శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవం తిలకించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# సిహెచ్ వోలను క్రమబద్ధీకరించాలని నిరసన

లక్కిరెడ్డిపల్లి ఏప్రిల్ 17 ప్రభాతవార్త
వైద్య ఆరోగ్య శాఖలోని NHM కింద దిబీవీలుగా పని చేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని గురువారం కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివకుమార్ మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా జీతాభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, దీనికి సమబంధించి మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివకుమార్ భరత్ కుమార్ దీప్తి శివరంజని మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# స్టార్టప్ దిశగా విద్యార్థులకు మార్గదర్శనం



(అన్నమయ్యప్రతినిధి ప్రభాతవార్త)
అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో గురువారం స్టార్టప్ దిశగా ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఇన్నొవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా, సివిల్ విభాగంతో కలిసి ఇయర్ 2, 3 విద్యుత్, మెకానికల్, సివిల్ శాఖల విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఇ. రాకేష్ రెడ్డి (ఈఈ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ సర్వీసెస్ ) నుండి హాజరై, "విజయవంతమైన స్టార్టప్ వ్యాపారిని తయారు చేసే నిర్ణయ తీసుకునే ప్రక్రియ" అనే అంశంపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిశ్రమల్లో అనేక ఉద్యోగాలు ఉన్నప్పటికీ, వాటిని పొందాలంటే విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరిగా చేయాలి. వారు ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థలే భవిష్యత్తులో వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించగలవని తెలిపారు. ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులు కంపెనీల అవసరాలను అర్థం చేసుకుని తమను తాము సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక విజయవంతమైన ఎంట్రప్రెన్యూర్ కావాలంటే నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉండాలన్నారు. మంచి నిర్ణయాలను తీసుకోవాలంటే పట్టు, ఫోకస్ చాలా ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడాన్ని వైస్ ఛాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి, రిజిస్ట్రార్ డా. ఎన్. మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డా. ఎస్. ఎమ్.వి. నారాయణలు అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తమైన జ్ఞానం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ముమ్ముందు మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు.

# నో వర్క్... నో పే...

(అవినీతికి పాల్పడి జైలుకెళ్లినా జీతం కావాలన్నా ఉద్యోగికి జీతం చెల్లించనవసరం లేదు-అలహాబాద్ హైకోర్టు)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :
చెయ్యని పనికి జీతం చెల్లించాల్సిన అవసరం లేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన ఓ ఉద్యోగి జైలు శిక్షను అనుభవించిన కాలంలో తనకు జీతం చెల్లించాలని తాను పని చేస్తున్న సంస్థను కోరడం కుదదని, అతనికి జీతం చెల్లించనవసరం లేదని ధర్మాసనం పేర్కొనింది. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లంచం తీసుకున్న ఓ ఉద్యోగి 2015-2018 సం॥రం॥ల మధ్య జైలులో వున్నాడు. విడుదలైన తరువాత మూడేళ్ల కాలానికి తనకు జీవం ఇవ్వాలంటూ విద్యుత్ సంస్థను కోరగా సదరు సంస్థ తిరస్కరిస్తూ పని చెయ్యని కాలానికి వేతనం ఇవ్వలేమని తేల్చి చెప్పగా సదరు ఉద్యోగి విద్యుత్ సంస్థ పై హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా విచారించిన ధర్మాసనం జీతం చెల్లించకపోవడం సరైన చర్యే అని తీర్పును వెలువరించింది. ఏదైనా సందర్భంలో యజమాని ఉద్యోగి పనిచేయలేని పరిస్థితులు కల్పిస్తే అప్పుడు నో వర్క్, నో పే నిబంధనలను కూడా ప్రక్కన పెట్టి ఆ ఉద్యోగికి జీతం ఇవ్వాల్సి వుంటుందని కూడా ధర్మాసనం పేర్కొంటూ ఈ కేసులో యాజమాన్యం అటువంటి పరిస్థితి కల్పించలేదు కాబట్టి నో వర్క్ నో పే వర్తిస్తుందని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదిరి బోపాల్ సింగ్ పంచాల్, రంచోడ్ జీ చతుర్జీ, ఠాకూర్ ఎదిరి సూపరింటెండెంట్ ఇంజనీర్, గుజరాత్, ఎలక్ట్రిసిటీ బోర్డు, హిమ్మత్ నగర్‌కు సంబంధించిన కేసులను కోర్టు ఉదహరించింది. తాను పని చెయ్యని కాలానికి జీతం తీసుకునే చట్ట పరమైన హక్కు ఈ కేసులో పిటీషన్‌దారుకు లేదని, అది ప్రభుత్వ ఖజానా పై అదనపు భారం అని కూడా ధర్మాసనం తీర్పు వెలువరించింది. (శివకర్ సింగ్ ఎదిరి స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ మరియు ఇతరులు 5 మంది, డబ్ల్యుఎ నెం.10045/2020)

# తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ రాత్రి తిరునాల



కురబలకోట ఏప్రిల్ 17 ప్రభాతవార్త
కురబలకోట మండలం, తెట్టు గ్రామం అందు వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ తల్లి జాతర మహోత్సవం 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు మొదలై 17వ తేదీ అమ్మవారికి భక్తులు, భక్తి శ్రద్ధలతో బాణాలు సమర్పించి వారి కోరికలు నెరవేరి నందు గాను పొట్టేలు బలిచ్చి వారి భక్తిని చాటుకున్నారు. అమ్మవారు చాలా శక్తివంతమైనవారు. ఎవరైనా తన భక్తులు కోరికలు కోరితే ఆ కోరికలు అన్నిటిని తీర్చే గ్రామ దేవతగా వెలసినది. అమ్మవారి టెంపుల్ ప్రతి సంవత్సరం అంచ లంచలుగా అభివృద్ధి చేస్తూ పూజారి వారి కుటుంబ సభ్యులందరినీ ఏకతాటిపై నిలబెట్టి శ్రీ పాలేటి గంగమ్మ దేవస్థానమును పూజారి అంజి ధర్మకర్తగా వ్యవహరిస్తూ అన్ని కార్యక్రమాలను సజావుగా నడిపిస్తున్నాడు. ఇప్పుడు ఈ జాతర సుమారుగా 10 పంచాయితీలు కలిపి జరుపుకొనుచున్నవి. శుక్రవారం రాత్రి సుమారుగా 30 పైన చాందిని బండ్లు వస్తున్నట్లు పూజారి అంజి తెలియజేశారు. జాతర సజావుగా జరుగుటకు పోలిపోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, పంచాయితీ శాఖ మరియు కురబలకోట మండల దేవలప్మెంట్ అథారిటీ శాఖల అందరిని సమన్వయం చేసి వీరందరూ ఆధ్వర్యంలో జాతర జరుపుటకు సన్నాహాలు చేశారు. అమ్మవారిని భక్తులందరూ దర్శించుకోవాలని మరియు అమ్మవారి కృపా కటాక్షాలు అందరూ పొందాలని పూజారి అంజి పిలుపునిచ్చారు. అదేవిధంగా అమ్మవారి గుడి దగ్గర గురువారం శుక్రవారం శనివారం ఈ మూడు రోజులు భక్తులందరికీ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

# మిట్స్‌లో 2k 25

కురబలకోట ఏప్రిల్ 17, ప్రభాతవార్త
అంగళ్ళు సమీపం లో గల మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగము వారు అమెరికన్ సొసైటీ సివిల్ ఇంజనీర్స్ (తిఛీదిని) మిట్స్ స్టూడెంట్స్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం "సీటా 2ర25" ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూపేష్ కుమార్, మున్సిపల్ ఇంజనీర్, మదనపల్లె పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సివిల్ ఇంజనీరింగ్ యొక్క పాత్ర ఎనలేనిదని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శాస్త్రీయంగా రూపకల్పన చేయబడిన నిర్మాణాలు, వంతెనలు, రహదారులు, నీటి పారుదల వ్యవస్థలు, పట్టణ ప్రణాళిక – ఇవన్నీ సివిల్ ఇంజనీరింగ్ రంగానికి చెందినవన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సివిల్ ఇంజనీర్లు భవిష్యత్తు అవసరాలను తీర్చగల మౌలిక నిర్మాణాలను రూపొందిస్తున్నారు అని, డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (తీఎ) వంటి నూతన సాంకేతికతలు సివిల్ ఇంజనీరింగ్ రంగాన్ని మరింత సమర్థవంతంగా మార్చాయన్నారు, నగరాల పునర్నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, సురక్షితమైన గృహ నిర్మాణం వంటి అవసరాలకి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిష్కారాలను అందించడంలో సివిల్ ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు అని అన్నారు. కళాశాల పి.జి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పనా మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం కు దేశ నలుమూలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఆటో క్యాడ్ డ్రాయింగ్ మరియు వెబ్ డిజైనింగ్ ఈవెంట్ లలో పాల్గొనడానికి వచ్చారని అని అన్నారు. విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ని నిర్వహించడానికి ప్రోత్సహించిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి కి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కు కృతజతలు తెలియజేసారు.

